
# ఓ మనిషీ!

## నీ సృష్టికర్తను గుర్తించు!



CFMM CENTRE FOR FINAL MESSAGE TO MANKIND
Guntur, A.P. (India)

**O man! Know about Your Creator**
(Telugu)

# ఓ మనిషీ
# నీ సృష్టికర్తను గుర్తించు!

ఓ మానవుడా! ఉదాత్తుడైన నీ ప్రభువు (అల్లాహ్)
పట్ల ఏ విషయం నిన్ను మోసంలో పడవేసింది?
(యదార్థానికి) ఆయనే నిన్ను పుట్టించాడు, నిన్ను
చక్కగా తీర్చిదిద్దాడు, ఆపైన నిన్ను తగు రీతిలో
పొందికగా మలిచాడు. *(ఖుర్‌ఆన్ 82:6-8)*

**CENTRE FOR FINAL MESSAGE TO MANKIND**
**(Quran & Sunnah)**
YouTube www.youtube.com/user/finalmessage609
www.facebook.com/centerforfinalmessagetomankind
Email: finalmessage609@gmail.com

## విజ్ఞులారా గ్రహించండి!

ఈ ఖుర్‌ఆన్ సమస్త మానవుల కొరకు ఒక సందేశం. తద్వారా వారిని హెచ్చరించటానికి, అల్లాహ్ ఒక్కడే ఆరాధ్య దైవమని వారు గ్రహించటానికి, ఇంకా విజ్ఞులు గ్రహించగలగటానికి (ఇది పంపబడింది).

(ఖుర్‌ఆన్ 14:52)

## మీ జీవితానికి ఓ అర్థం ఉంది

"మేము మిమ్మల్ని ఏదో ఆషామాషీగా (అర్థ రహితంగా) పుట్టించామనీ, మీరు మా దగ్గరకు మరలిరావటం అనేది జరగని పని అని అనుకున్నారా?" (ఖుర్‌ఆన్ 23:115)

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో ప్రారంభం

# ఓ మనిషీ!
# నీ సృష్టికర్తను గుర్తించు

సోదరులారా!

కొంచెం సావధానంగా ఆలోచించండి. అనంతమైన ఈ సృష్టిలో లెక్కలేనన్ని వస్తువులు సృష్టించబడ్డాయి. భూమ్యాకాశాలు, సూర్య, చంద్ర, నక్షత్రాలు, గాలి, నీరు, అగ్ని, వృక్షజాతి, ఒకటేమిటి.... పరమాణువు నుంచి బ్రహ్మాండం దాకా ఎన్నో సృష్టించబడ్డాయి. ప్రపంచం ప్రారంభం నుండి ఎందరో మేధావులు, జ్ఞానులు, మహామహులు, శాస్త్రవేత్తలు గతించారు. కాని ఈ అనంతమైన విశ్వంలో వారు అదనంగా ఏ వస్తువునీ సృష్టించలేదు. ఆఖరికి ఓ చిన్న ఆకును కూడా సృష్టించలేకపోయారు.

సోదరులారా! ఆలోచించవలసిన విషయం ఏమి టంటే ఈ ప్రకృతిలో వున్న ప్రతి వస్తువు మనిషి మనుగడ కోసమే ఉపయోగపడుతుంది. శాస్త్రవేత్తల పరిశోధనలు ఈ విషయాన్నే తెలుపుతున్నాయి. ఈ సృష్టిలో ఏ జీవి పూర్తిగా నశించినా దాని దుష్ ప్రభావం ఎట్టకేలకు మానవ జీవితంపైనే పడుతుంది. దీనిని బట్టి ప్రపంచంలోని ప్రతి వస్తువు మనిషి జీవిక కోసమే సృష్టించబడిందని అర్థమవుతోంది. అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఒకచోట అంటున్నాడు:

"ధరణిలో వున్న సమస్త వస్తువులనూ మేము మానవుని కోసమే సృష్టించాము."

***(ఖుర్‌ఆన్ 2:29)***

పై వాక్యాన్ని బట్టి చూస్తే ఈ ప్రపంచంలో మనిషి మనుగడకు కావలసిన ప్రతి దానిని ఆ దైవం సృష్టించా డని తెలుస్తోంది. రాత్రింబవళ్ళు, ఎండా, నీడ, ఋతు పవనాలు, పంట పొలాలు.... ఇలా అన్నీ మనిషి కోసం సృష్టించబడినవే.

## మరి, ఓ మనిషీ నీవెందుకు సృష్టించబడ్డావు?

ఆకాశం నీ కోసం, భూమి నీ కోసం, సూర్య చంద్రులు నీ కోసం, రాత్రింబవళ్ళు నీ కోసం, వృక్ష జంతుజాతులు నీ కోసం, పర్వతాలు, సముద్రాలు నీ కోసం– జీవమున్నవి, జీవము లేనివి, ఇలా సకలం నీ కోసమైనప్పుడు మరి నీవు దేనికోసం సృష్టించ బడ్డావ్? నీ జీవితానికి లక్ష్యమంటూ లేదా? నీ పుట్టుకకు పరమార్థం అంటూ లేదా?

### ఆలోచించు!

సృష్టిలో వున్న ప్రతి వస్తువు నీ సేవకోసం సృష్టించ బడింది. పరమాణువు నుంచి బ్రహ్మాండం దాకా ప్రతి దాని వెనుక ఓ కారణముంది. ఆ కారణమేమిటో నీవు గ్రహించాలి. మనకున్న జ్ఞానంతో తయారు చేయ లేని అనంతమైన ఈ విశ్వాన్ని సృష్టించిన ఆ మహా సృష్టికర్తను ఆరాధించటానికి, ఆయన దాస్యం చేయ డానికే ఆయన మనల్ని పుట్టించాడు.

"మేము మానవులను, జిన్నాతులనూ కేవలం మా

ఆరాధన కొరకు తప్ప మరి దేని కొరకూ సృష్టించలేదు.” (ఖుర్ఆన్ 51:56)

పై వాక్యాన్ని బట్టి ఎవరైతే మనల్ని సృష్టించాడో ఈ అనంతమైన ప్రకృతిని తీర్చిదిద్దాడో ఆ సృష్టికర్తను మాత్రమే మనం ఆరాధించాలి.

సాధారణంగా మనలో వచ్చే ఓ ఆలోచన:

**ఆ దైవాన్ని ఎందుకు ఆరాధించాలి?**

సోదరుడా! ఒకసారి నీ పుట్టుకను గురించి ఆలోచించు; నీవెప్పుడు పుట్టావు? ఎక్కడ పుట్టావు? ఎవరికి పుట్టావు? ఇవి నీకు తెలియకుండానే నీ ఇష్టంతో ప్రమేయం లేకుండానే జరిగాయి. అంటే మనం కావాలనుకున్నప్పుడు పుట్టడం జరగదు. ఎక్కడ కావాలనుకున్నావో అక్కడ కాని, ఎవరికి కావాలనుకున్నావో వారికి గాని నీవు పుట్టలేదు. నీ మరణం కూడా అంతే! నీవు ఎప్పుడు మరణిస్తావో, ఎక్కడ మరణిస్తావో, ఎలా మరణిస్తావో ఎవరికీ తెలియదు. ఈ విషయాలన్నీ కూడా నీ ఇష్టంతో ప్రమేయం లేకుండానే జరుగుతున్నాయి.

దీనినిబట్టి అర్థమయ్యేదేమిటంటే, చావు పుట్టుకలు మన ఆధీనంలోలేవు. వాటికి మన ఇష్టంతో ప్రమేయం లేదు. మరి అలాంటప్పుడు చావుపుట్టుకల మధ్య వున్న ఈ జీవితాన్ని నీ ఇష్ట ప్రకారం గడుపుతానంటే ఎలా కుదురుతుంది. నీ చావు పుట్టుకలు ఎవరి ఇష్టంతో జరిగాయో ఆ సృష్టికర్త ఇష్టప్రకారమే నీవు జీవితాన్ని గడపాలి. ఆ విధంగా గడపటాన్నే "ఆరాధన" అంటాము.

## ఆరాధన అంటే ఏమిటి?

మనుష్యులు ప్రపంచంలో మరే పని చేయకుండా, ప్రాపంచిక బాధ్యతలేవీ నిర్వర్తించకుండా పొద్దస్తమానం పూజాపునస్కారాలలో, వ్రతాలు దీక్షల్లో, భజన అర్చనల్లో, ప్రార్థనల్లో, నమాజు, ఉపవాసాల్లో నిమగ్నులై వుండాలని దీని భావమా? పూర్వం చాలామంది అదే అనుకుని తప్పుదారిన పడ్డారు. ప్రపంచంతో తెగతెంపులు చేసుకుని సన్యాసత్వం పుచ్చుకుని, అడవుల్లో, కొండ గుహల్లో తపస్సు చేసుకుంటూ కూర్చో

వటమే ఆరాధన అని భావించారు. నిజానికి ఆరాధనకు భావం అదికాదు.

## ఆరాధనకు చాలా విస్తృతమైన భావం వుంది

కాస్త ఆలోచించండి! దేవుడు విశాలమైన విశ్వాన్ని, అందులో సూర్యచంద్ర నక్షత్రాలను సృష్టించి వాటిని ఊరికే వదలి వేయలేదు. వాటికోసం ఒక ప్రణాళికను, కొన్ని నియమ నిబంధనలను నిర్ణయించాడు. అవి వాటి ప్రకారమే నడుస్తున్నాయి. సూర్యుడు తూర్పు దిక్కునే ఉదయిస్తున్నాడు. చంద్రుడు రాత్రి పూట మాత్రమే వెన్నెలను కురిపిస్తున్నాడు. గ్రహాలు తమ తమ కక్ష్యలలోనే తిరుగుతున్నాయి. ప్రపంచం పుట్టినప్పటి నుండి ఇప్పటి వరకు సూర్యుడు ఏనాడూ పశ్చిమాన ఉదయించలేదు, చంద్రుడు భూమిని ఢీకొనలేదు. గ్రహాలు తమ కక్ష్యలు దాటలేదు. రాత్రి రాకుండా ఏ రోజు ఆగలేదు. భూమి మనుష్యుల భారం మోయను అని మొండికేయలేదు. ఇలా జరగటానికి గల కారణం; దేవుడు వాటికి కొన్ని నియమాలు

పెట్టాడు. అవి వాటిని పాటిస్తున్నాయి. ఏ ఆజ్ఞ ఇవ్వ బడిందో ఆ ఆజ్ఞను తు.చ. తప్పకుండా ఆచరిస్తు న్నాయి. మరో మాటలో చెప్పాలంటే అవి సృష్టికర్తను ఆరాధిస్తున్నాయి.

అలాగే విశ్వప్రభువైన ఆ మహా సృష్టికర్త మానవు లకు కూడా కొన్ని నియమ నిబంధనలను పెట్టాడు. మనందరి కోసం క్రమశిక్షణతో కూడిన ఓ జీవన విధానాన్ని నిర్ణయించాడు. ఆ సృష్టికర్త నిర్ణయించిన సంవిధానం ప్రకారం జీవితం గడపటమే ఆరాధన. దీని ప్రకారం మనిషి జీవితంలోని ప్రతి సందర్భం, ప్రతి సంఘటన, ప్రతి విషయము, ప్రతి మాట ఆరాధన కాగలదు. అన్నం తినటం, నీళ్ళు త్రాగడం, పడుకోవడం, లేవడం, కాలకృత్యాలు తీర్చుకోవడం, ధనం సంపాదించడం, భాధ్యతలను నెరవేర్చడం, ఇవన్నీ మానవుని జీవితంలో జరిగే సాధారణ పనులు. కాని వీటినే గనుక సృష్టికర్త సూచించిన పద్ధతి ప్రకారం, ఆయన ఇష్టపడాలనే ఉద్దేశ్యంతో చేస్తే అవన్నీ ఆరాధనలు అయిపోతాయి.

**అయన సూచించిన ప్రకారమే ఎందుకు చేయా లంటే...**

నీ శరీరంలో వున్న ఏ అవయవాన్నీ నీవు నీ స్వంతంగా తయారు చేసుకోలేదు. ఈ కళ్లను నీవు కష్టపడి కూర్చి, పేర్చి నీ కనుగుంతల్లో అమర్చుకోలేదు. నీ చేతులను నీవు తయారు చేసుకోలేదు. ఈ విధంగా నీ గుండె, నీ ఊపిరి తిత్తులు, మూత్రపిండాలు, ఒకటే మిటి నఖశిఖ పర్యంతం ఏ అవయవమూ నీవు తయారుచేయలేదు. ఇతరుల చేతనూ చేయించుకో లేదు. ఆఖరికి ఓ చిన్న గోరును కూడా నీవు పుట్టించు కోలేదు. వీటన్నింటిని సృష్టించినవాడు, వాటిని వాటి వాటి పనులను చేసేవిధంగా ఆజ్ఞాపించినవాడు ఆ "నీ సృష్టికర్తే "!

> అయనే మీకు వినేశక్తి గల చెవులను, చూసే శక్తిగల కళ్లను, ఆలోచించడానికి హృదయాన్ని ఇచ్చినవాడు. కాని మీరు అయనకు కృతజ్ఞతలు తెలిపేది బహుతక్కువ. ***(ఖుర్‌ఆన్ 23:78)***

పై వాక్యాన్ని బట్టి, మనకు అన్నింటిని సమ

కూర్చిన ఆ సృష్టికర్తకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన ఆదేశాల ప్రకారం నీవు నీ జీవితాన్ని గడపాలి. ఆ ప్రకారంగా మనిషి తోటివారిని చిరుమోముతో పలకరించడం కూడా ఆరాధనగానే పరిగణించబడుతుంది. దారిలో వున్న ముళ్లు తొలగించినా, భార్యా పిల్లల కోసం సంపాదించినా, సంతానాన్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నా, చివరికి ప్రేమతో నీ భార్యకు ఒక ముద్ద అన్నం తినిపించినా, ఈ విధంగా నీవు చేసే ఏ పనైనా దైవ ప్రసన్నతా ఉద్దేశ్యంతో గనుక చేస్తే అది కూడా 'ఆరాధనే ' అవుతుంది.

## మరి ఆ ఆరాధ్యుడు ఒక్కడా ? అనేకమందా?

సోదరులారా! జ్ఞానంతో ఆలోచించినట్లయితే భూమండలంలో వున్న 750 కోట్ల మంది మానవులందరూ ఒకే శరీర నిర్మాణాన్ని కలిగివున్నారు. కారణం నిర్మాత ఒక్కడే కాబట్టి. హిందువులమని, క్రైస్తవులమని, ముహమ్మదీయులమని, జైనులమని, బౌద్ధులమని, సిక్కులమని – మనం మతాలను సృష్టించుకుని వేరు వేరుగా పిలవబడుతున్నాము. అంతేకాని, ఆ అల్లాహ్

మతాలను నిర్ణయించలేదు. ఆయన మనుషులను సృష్టించాడు. మనుషులు మతాలను సృష్టించుకున్నారు. ఆ సృష్టికర్త అల్లాహ్ జీవన మార్గాన్ని (ఇస్లాంను) నిర్ణయించాడు. కులాల సంగతి కూడా అంతే. ఇవి కూడా మనుషులే కల్పించుకున్నారు. ఇది తక్కువ కులం, అది ఎక్కువ కులం, వాడు అంటరానివాడు అని ఉచ్ఛనీచాలు సృష్టించుకున్నారు. వాస్తవానికి ఈ కులాలనేవి ప్రారంభంలో వృత్తులకు పెట్టిన పేర్లు. అంతేకాని అల్లాహ్ కులాలను కూడా నిర్ణయించలేదు. ఈ కుల మతాలకు అల్లాహ్ దగ్గర ఎలాంటి విలువ లేదు. కావున సోదరులారా! మనందరం ఒకే తల్లి దండ్రుల సంతానం. మనమందరిది ఒకే జాతి. మన మందరం ఒకే దేవుని దాసులం.

మానవులారా! మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించి, దాన్నుంచే దాని జతను కూడా సృష్టించి, ఆ ఇద్దరి ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను వ్యాపింపజేసిన మీ ప్రభువుకు భయ పడండి. ఎవరిపేరుతో మీరు పరస్పరం మీకు

**కావలసిన వాటిని అడుగుతారో ఆ అల్లాహ్‌కు భయపడండి. బంధుత్వ సంబంధాల తెగత్రెంపులకు దూరంగా ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ మీపై నిఘావేసి ఉన్నాడు. *(ఖుర్‌ఆన్ 4:1)***

గాలి, నీరు, భూమి, వాతావరణం - ఇలా పంచ భూతాలన్నింటిని మనమంతా సమానంగా వినియోగించుకోగలగుతున్నాం. కారణం ఆ సృష్టికర్త ఒక్కడే కాబట్టి. అంతేగాని మనిషికో దేవుడు, మతానికో దేవుడు, ప్రాంతానికో దేవుడు, జాతికో దేవుడు లేడు.

**ఒకవేళ భూమ్యాకాశాలలో అల్లాహ్ గాక ఇతర దేవుళ్ళు కూడా ఉండి ఉంటే ఈ రెండింటిలో అరాచకం ఏర్పడేది. కాబట్టి సింహాసనానికి (అర్ష్‌కు) అధిపతి అయిన అల్లాహ్ వారు కల్పించే భాగస్వామ్య (షిర్క్) విషయాలన్నింటికీ అతీతుడు, పవిత్రుడు. *(ఖుర్‌ఆన్ 21 : 22)***

అందుకనే అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లోని మరో వాక్యంలో ఇలా ఆజ్ఞాపిస్తున్నాడు

**“ఇద్దరిని దేవుళ్ళుగా చేసుకోకండి. అల్లాహ్**

మటుకు ఒక్కడే. కనుక మీరు ఆయనకే భయపడండి." ఆకాశాలలో వున్నదంతా, భూమిలో ఉన్నదంతా ఆయనదే. కేవలం ఆయన ధర్మం మాత్రమే(సృష్టి అంతటా)అనుసరించబడుతుంది. అలాంటపుడు మీరు అల్లాహ్‌ను కాదని మరొకరికి భయపడతారా? **(ఖుర్‌ఆన్ 16 : 51-52)**

### అతి పెద్ద పాపమే కదా?!

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు: పాపాల్లో అన్నిటికన్నా అతి పెద్ద పాపం ఏమిటో తెలుసా? మిమ్మల్ని పుట్టించిన వాడు అల్లాహ్‌యే అయినప్పటికీ మీరు ఆయనకు ఇంకొకరిని సాటి కల్పించటం. *(బుఖారీ గ్రంథం)*

ఇప్పుడు మనలో ఓ ప్రశ్న ఉదయిస్తుంది. అల్లాహ్ అంటే ఒక ప్రత్యేక మతస్థులు ఆరాధించే వాడేమోనని. కాని అది వాస్తవ విరుద్ధము. అల్లాహ్ అనేది ఆ మహా సృష్టికర్త పేరు. అంతేకాని ఆయన ఓ మనిషో, వస్తువో, చెట్టో, పుట్టో, జండానో, దర్గానో కానేకాదు.

మరి ఆ అల్లాహ్ ఎవరు ?

అయనే అల్లాహ్ - భూమిని, ఆకాశాలను వాటి మధ్యలో వున్న సమస్త వస్తువులను ఆరురోజుల్లో సృష్టించినవాడు. *(ఖుర్ఆన్ 32:4)*

అయనే అల్లాహ్-ఎత్తయిన ఆకాశాలను ఎలాంటి అధారాలు లేకుండా నిలిపినవాడు. *(ఖుర్ఆన్ 13:2)*

అయనే అల్లాహ్ - భూమిని మానవ నివాస యోగ్యంగా చేసినవాడు. *(ఖుర్ఆన్ 2:22)*

అయనే అల్లాహ్ - మిమ్మల్ని పుట్టించినవాడు, మిమ్మల్ని పోషించేవాడు, ఆ తరువాత మీకు మరణం ఇచ్చేవాడు. ఆపై మిమ్మల్ని తిరిగి బ్రతికించేవాడు. మీరు దైవ సమానులుగా నిర్ణయించుకున్న వారిలో ఎవడైనా ఈ పనులు చేసేవాడు ఉన్నాడా? మానవులు కల్పించే (భాగస్వామ్యాల) బహుదైవారాధన నుండి అల్లాహ్ ఎంతో పవిత్రుడు, ఉన్నతుడును. *(ఖుర్ఆన్ 30:40)*

పై వాక్యాలను బట్టి ఆకాశాన్ని, భూమిని, పర్వతా

లనూ, సముద్రాలను సృష్టించినవాడు, పై నుండి వర్షాన్ని కురిపించేవాడు, భువిలో నుంచి పంటలు పండించేవాడు, సూర్య చంద్రులను నియమబద్ధులుగా చేసినవాడు, రాత్రింబవళ్లను మార్చుతున్నవాడు, మనల్ని పుట్టించిన వాడు, పోషిస్తున్నవాడు, మరణం ఇచ్చేవాడు, మరలా బ్రతికించేవాడు ఆ ఒక్క సృష్టికర్తే. ఆయన తప్ప ఈ ప్రపంచంలో ఏ ఒక్కరు కూడా ఈ పనులలో ఏ ఒక్కదానిని చేయలేరు. వారికి ఆ శక్తి సామర్థ్యాలు కూడా లేవు.

ఈరోజు మనిషి ఆ సృష్టికర్తను విడిచిపెట్టి ఎవరినైతే ఆరాధిస్తున్నాడో, పూజిస్తున్నాడో వారు కూడ మన లాంటి మానవులే. మనకున్న శరీరం, ఆకలి దప్పికలు నిదుర, కునుకులు, మల మూత్ర విసర్జనలు వారికీ వున్నాయి. ఆ దైవం మనలాంటి బలహీనతలు, లోపాలు కల్గినవాడుకాదు. మానవాతీతమైన లక్షణాలు కల్గినవాడు.

## అల్లాహ్ లక్షణాలు

అల్లాహ్ లక్షణాలపై ఖుర్‌ఆన్‌లోని కొన్ని ఆయత్‌ల భావాలు ఇక్కడ పొందుపరచడం జరుగుతోంది.

పుట్టించేవాడే కాని పుట్టేవాడు కాదు.

*(ఖుర్ఆన్ 112 : 3)*

మరణం ఇచ్చేవాడేకాని మరణం లేనివాడు.

*(ఖుర్ఆన్ 25 : 58)*

నిదురను ఇచ్చేవాడు, నిద్రించనివాడు.

*(ఖుర్ఆన్ 2 : 255)*

ఆకలిని తీర్చేవాడు, ఆహారం అవసరం లేనివాడు.

*(ఖుర్ఆన్ 51 : 57)*

సంతానం ఇచ్చేవాడు, సంతానం లేనివాడు.

*(ఖుర్ఆన్ 112:3, 42 : 49)*

మనల్ని చూసేవాడు, మనకు కనబడనివాడు.

*(ఖుర్ఆన్ 6 : 103)*

అలసిపోనివాడు. *(ఖుర్ఆన్ 50 : 38)*

భూమ్యాకాశాలకు వెలుగైనవాడు.

*(ఖుర్ఆన్ 24 : 35)*

సృష్టినాశనం అవుతుంది, తాను నాశనంలేని వాడు. *(ఖుర్ఆన్ 55 : 26)*

సృష్టిలో ఏ వస్తువుతో పోలిక లేనివాడు.

(ఖుర్ఆన్ 42 : 11)

అవసరాలు తీర్చేవాడు, అవసరాలు లేనివాడు.

(ఖుర్ఆన్ 112 : 2)

మొదటివాడు, ఆఖరివాడు. (ఖుర్ఆన్ 57 : 3)

మారనివాడు, స్థిరంగా ఉండేవాడు.

(ఖుర్ఆన్ 2 : 255)

పై లక్షణాలు కలిగిన ఆ సృష్టికర్త ఈ ప్రపంచంలో తన గురించి చాటిచెప్పడానికి స్వర్గ శుభవార్తలు వినిపించడానికి, నరక హెచ్చరికలు చేయడానికి ఎంతో మంది ప్రవక్తలను, ఈ ప్రపంచంలోనికి పంపించాడు. వారిలో మర్యమ్ కుమారుడు ఈసా (ఏసు) కూడా ఓ దైవప్రవక్త, కాని దురదృష్టం ఏమి టంటే ఎంతోమంది ఈనాడు ఆ దైవప్రవక్తను దేవునిగా, దేవునిలో భాగంగా, దేవుని కుమారునిగా, త్రియేక దేవునిగా భావిస్తున్నారు. కాని ఈసా(అ) తన జీవితాంతం ఎప్పుడూ తాను దేవుడనని ప్రకటించ లేదు.

మర్యమ్ కుమారుడు మసీహ్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. ఆయనకు పూర్వము కూడా ఎంతో మంది ప్రవక్తలు గతించారు. ఆయన తల్లి ఓ సద్గుణ సంపన్నురాలు. వారు ఇద్దరు రోజు భోజనం చేసేవారు *(ఖుర్ఆన్ 5 : 75)*

ఆయన ఆరాధన చేసేవారు. *(ఖుర్ఆన్ 19 : 31)*

పైవాక్యాలను బట్టి-యేసు(అ) కూడా మనలాంటి మనిషేనని, ఆయనకు కూడా బలహీనతలు ఉన్నాయని, పుట్టినవాడని, ఆకలిదప్పికలు ఉన్నవాడని అర్థం అవుతుంది. అన్నింటికంటే ఆయన ఎక్కువగా ప్రార్థించేవాడని తెలుస్తుంది. ఈయన కూడా ఇతర ప్రవక్తల వలే అద్భుతాలు చేసారు. ఈయన దేవుని ప్రవక్త మాత్రమే. ఆరాధించేవాడు దాసుడే కాని దేవుడు కాజాలడు, ఆరాధింపబడేవాడే ఆరాధ్యుడు, దేవుడు.

ఈ ప్రవక్తల పరంపరలో మర్యమ్ కుమారుడు ఈసా మసీహ్ (అ)తరువాత చిట్టచివరిగా లోక కళ్యాణార్థమై ప్రపంచ శాంతికోసం ప్రభవింపజేయబడిన అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స.అ.స).

## ముహమ్మద్ (స.అ.స) సర్వమానవాళికి ఇచ్చిన సందేశం

మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను. ***(ఖుర్ఆన్ : 7:158)***

ఈ ప్రవక్తపై అవతరించబడిన చిట్టచివరి గ్రంథం ఖుర్ఆన్. ఇది సర్వమానవాళికి మార్గదర్శకం.

## ఇస్లాం

సోదరులారా! ఇస్లాం అంటే శాంతియుత జీవన విధానమనీ, పరలోక జీవన సాఫల్యానికి మార్గమనీ అర్థం. అంతేకాని ఇస్లాంలో అశాంతికి తావే లేదు. రక్తపాతాలకు, మారణహోమాలకు స్థానమేలేదు.

అల్లాహ్ దృష్టిలో ఇస్లాం మాత్రమే ఆమోదింపదగిన ధర్మం. ***(ఖుర్ఆన్ : 3:19)***

ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవుల్ని చంపినట్లే, ఒక మానవుణ్ణి కాపాడినవాడు సమస్త మానవుల్ని కాపాడినట్లే. ***(ఖుర్‌ఆన్ : 5 : 32)***

కుస్తీలు పట్టి చిత్తు చేసినవాడు కాదు వీరుడు, క్షమించి వదిలేసేవాడే ధీరుడు.

***(ముస్లిం, హ.నెం.2609)***

తల్లి పాదాల కింద వుంది స్వర్గం. ***(హదీస్)***

తండ్రి స్వర్గానికి ప్రధాన ద్వారం.

***(తిర్మిజీ, హ.నెం: 1900)***

తల్లిదండ్రులకు విధేయత చూపండి.

***(బుఖారీ మఅల్ ఫత్హ్, 10, 5970)***

సోదరులారా! ఇవి ముహమ్మద్(స.అ.స) ప్రవచనాలు. కనుక ఆలోచించండి. గతించిపోయిన జీవితం గురించి చింతించకండి. జరిగినదేదో జరిగిపోయింది. జరగాల్సిన దాని గురించి ఆలోచించండి. జరిగిన పాపానికి పరిహారం పశ్చాత్తాపం. పాప పరిహారానికి రక్తం అవసరంలేదు. ఇకనైనా జ్ఞానంతో ఆలోచించి నిన్ను పుట్టించిన నీ సృష్టికర్తను ఆరాధించు.

కాబట్టి పఠించండి (విశ్వసించండి) లాయిలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ రసూలుల్లాహ్.

అంటే భూమ్యాకాశాల సృష్టికర్త అల్లాహ్ తప్ప మరొక దేవుడు లేడు. ముహమ్మద్ (స.అ.స) అల్లాహ్ యొక్క చివరి ప్రవక్త.

చూడండి! మీ వద్దకు మీ ప్రభువు అల్లాహ్ తరుపు నుండి వివేచనా కాంతులు వచ్చేశాయి. కనుక ఇక దృష్టిని వినియోగించుకునే వ్యక్తి తనకు తానే మేలు చేసుకుంటాడు. మరి గ్రుడ్డిగా వ్యవహరించే వ్యక్తి తానే నష్టపోతాడు. నేను మాత్రం కావలివాణ్ణి కాదు. ***(ఖుర్ఆన్ : 6 :104)***

ధర్మంలో నిర్బంధం కాని, బలాత్కారం కాని లేవు. ***(ఖుర్ఆన్ : 2:256)***

ఒకవేళ నీవు తిరస్కరిస్తే భయంకరమైన నరకాగ్నికి ఆహుతి కావల్సి వస్తుంది.

నరకం

ఆ నరకం ఏమిటో నీకేమి తెలుసు? అది మిగిలించదు, వదలిపెట్టదు. అది చర్మాన్ని మాడ్చి వేసేది. ***(ఖుర్ఆన్ : 74:27–29)***

నిశ్చయంగా నరకం ఒక మాటు. ధిక్కారులకు అది నివాస స్థలం. యుగాల తరబడి వారు అక్కడే పడి వుంటారు. అందులో ఎలాంటి చల్లదనాన్ని, పానీయాన్ని చవిచూడలేరు. ఒకవేళ ఏదైనా దొరికితే అది సలసలా కాగే నీరు, గాయాల కడుగు మాత్రమే. అది (వారి కర్మలకు) పరిపూర్ణ ప్రతిఫలం. ***(ఖుర్ఆన్ : 78:21-25)***

ఒకవేళ నీవు విశ్వసిస్తే, నీకే లాభం. స్వర్గ ప్రవేశం లభిస్తుంది.

స్వర్గం

అల్లాహ్‌యే మా ప్రభువు అని పలికి ఆ మాట మీదనే స్థిరంగా నిలబడే వారిపై నిశ్చయంగా దైవ దూతలు అవతరిస్తారు. వారు వారితో ఇలా అంటారు: "భయపడకండి, బాధపడకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం అనే శుభవార్తను విని ఆనం దించండి. మేము(దైవదూతలం) ఈ ప్రాపంచిక జీవితంలోకూడా మీకు సహచరులుగా ఉంటాము, పరలోకంలో కూడా అక్కడ మీరు

కోరినదల్లా మీకు లభిస్తుంది. మీరు ఆశించే ప్రతి వస్తువు మీది అవుతుంది. ఇవి మీకు లభించే అతిథ్యపు ఏర్పాట్లు. క్షమాశీలుడు, కరుణామయు డైన అల్లాహ్ తరఫు నుండి. ***(ఖుర్ఆన్ :41 : 30)***


ఖుర్ఆన్ మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతోపాటు, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి.

***(ఖుర్ఆన్ : 2 : 185)***

కనుక ప్రజలారా! రండి మన మార్గదర్శకత్వం కోసం అల్లాహ్ పంపిన చిట్టచివరి గ్రంథం ఖుర్ఆన్‌ను చదివి అర్థం చేసుకుందాం. దాని ప్రకారం ఆచరిద్దాం. ఇహలోకంలోనూ, పరలోకంలోనూ అల్లాహ్ అనుగ్రహా నికి పాత్రులవుదాం.

ఎవడు నరకాగ్ని నుంచి కాపాడబడి, స్వర్గంలో ప్రవేశం కల్పించబడతాడో అతడే నిశ్చయంగా సఫలీకృతుడయినవాడు. ***(ఖుర్ఆన్ 3 : 185)***

అదే నిజమైన సాఫల్యం. మానవ జీవిత లక్ష్యం కూడా అదే.



CENTRE FOR FINAL MESSAGE TO MANKIND,

(QURAN & SUNNAH)

Guntur, A.P. (India) Cell: 9885977731, 9553683398

YouTube www.youtube.com/user/finalmessage609

www.facebook.com/centerforfinalmessagetomankind

Email: finalmessage609@gmail.com